సాక్షి పెద్దపల్లి

సోమవారం । 6 । నవంబర్ । 2023

9

ఓదెల మల్లన్నకు మొక్కులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భారీసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్ బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

చికిత.. 'బంగారం'



బంగారు పతకంతో చికిత

ఎలిగేడు(పెద్దపల్లి): గోవాలో జరుగుతున్న 37వ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఆర్చరీ కంపౌండ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ విభాగంలో బంగారు పతకం సాధించిన తొలిక్రీడాకారిణి ఈమేనని నిర్వాహకులు తెలిపారు. చికిత గతంలో సైతం జాతీయస్థాయి ఆర్చరీలో పలు పతకాలు సాధించింది. చికితను సుల్తాన్‌పూర్ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎలిగేడు ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు అభినందించారు.

మేజిక్ హరికి పురస్కారం



హరిని సత్కరిస్తున్న ప్రతినిధులు

కోల్ సిటీ: గోదావరిఖని నగరానికి చెందిన మేజిక్ హరికి జాదూరత్న అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఆదివారం ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంద్రజాల మహోత్సవాన్ని 'అమరావతి మేజిక్ ఫెస్టివల్' పేరిట ఘంగా నిర్వహించారు. వన్ మినిట్ మేజిక్ కాంపిటీషన్స్‌లో మేజిక్ హరికి ప్రత్యేక బహుమతి సాధించారు. హరికి బహుమతితోపాటు సుదీర్ఘకాలంపాటు ఇంద్రజాల రంగానికి విశిష్ట సేవలందిస్తున్నందుకు 'జాదూరత్న' అవార్డు ఇచ్చి సత్కరించారు. హరిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మేజిక్ రాజా, ప్రధాన కార్యదర్శి యతిరాజ్ కాస, నరేస్, దశరథం, బండి శంకర్, రత్నాకర్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, గోదావరి కళా సంఘాల సమాఖ్య, నియర్ అండ్ డియర్ సభ్యులు తానిపర్తి గోపాలరావు, వంగ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): కనగర్తి పద్మహన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ - 12లో ముద్దమల్ల అజయ్, అండర్- 14లో రాయిల్ల బాలరాజు, అండర్- 17లో మణిచరణ్‌తేజ, అండర్-14 రాయిల్ల కల్యాణి, అండర్-17లో గుంటి కావ్య ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. వీరిని సర్పంచ్ కొట దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన, ఎంఈవో రాజన్న, ప్రధానోపాధ్యాయుడు రమేశ్, పీఈటీ విష్ణు తదితరులు ఆదివారం అభినందించారు.

ముగిసిన వేద మహాసభలు



సర్టిఫికెట్ అందిస్తున్న స్వామీజీ

మంథని: మంత్రపురిగా పిలువబడే మంథనిలోని నృసింహ గార్డెన్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన తెలంగాణస్థాయి వేద విద్య మహాసభలు ఆదివారం ముగిశాయి. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీస్వామీజీ పాల్గొని వేద విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం శిక్షణ పొందిన పలువురు వేద విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. జనార్దనానంద సరస్వతీ స్వామి ట్రస్టు చైర్మన్ సాయినాథశర్మ, సీతారామ సేవా సదన్ వ్యవస్థాపకుడు గట్టు నారాయణ గురూజీ, అధ్యక్షుడు కేఎల్ఎన్ హరిబాబు, శశిభూషణ్ కాచేతోపాటు తదితరులు పాల్గొన్నారు.

విప్లవవీరుల పెద్దపల్లి

- ఎన్నికలపై నక్సల్స్ ప్రభావం
- తొలి ఎమ్మెల్యే పీడీఎఫ్ అభ్యర్థి
- శ్రీరాంసాగర్ జలాలతో 'వరి' సిరులు
- ఎస్సారెస్పీ కాలువపై జల విద్యుత్ కేంద్రాలు
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ముఖచిత్రం



పెద్దపల్లిరూరల్: విప్లవవీరులను అందించిన పెద్దపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష ఉద్యమానికి ఊపిరులూదిన మల్లోజుల సోదరులు కిషన్‌జీ ఉరఫ్ మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దపల్లి బిడ్డలే. వీరేకాకుండా అనేక మంది అగ్రనేతలుగా ఎదిగారు.

పెత్తందారీ వ్యవస్థపై పోరు

- అప్పటి పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు) పార్టీ పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక ప్రభావం చూపేది.
- ఈక్రమంలోనే పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారి పెద్దపల్లిలో డీఎస్పీ స్థాయి అధికారి బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ హతమార్చడం సంచలనం సృష్టించింది.
- పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి 1952లో జరిగిన తొలిఎన్నికల్లో ఎల్.ముత్తయ్య పీడీఎఫ్ నుంచి పోటీచేసి విజయం సాధించారు.

తొలి ఎన్నికలు 1952లో..

1952లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారితం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అందే సాగునీటితో వరి సిరులు కురిపిస్తోంది. ఎస్సారెస్పీ డీ-83 ప్రధానకాలువ పెద్దపల్లి నుంచి మంథనికి, డీ- 86 ద్వారా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని దాదాపు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అంతేకాదు.. కాలువలపై ఆరు చోట్ల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి.

వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్..

- పెద్దపల్లిలో వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్ అందుబాటులోకి వచ్చింది.
- ఈప్రాంత రైతులు అత్యధికంగా వేరుశనగ, కంది సాగుచేసేవారు. వరంగల్ తర్వాతి స్థానంలో అతిపెద్ద మార్కెట్‌గా పెద్దపల్లికి ఇప్పటికీ గుర్తింపు ఉంది.

ఓటర్ల తీర్పు విలక్షణం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పెద్దపల్లి ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చేవారు. వరుసగా రెండోసారి ఎవరినీ ఎన్నుకునేవారు కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో టీఆర్ఎస్ నుంచి దాసరి మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. 2018లోనూ ఆయనే విజయం సాధించి గతరికార్డులను బద్ధలు కొట్టారు. మూడోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో నిలిచారు.

'గోనె' ప్రత్యేక ముద్ర

1983లో జరిగిన పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షమైన సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరుమాసాలకే తన పదవికి రాజీనామా చేసిన గోనె ప్రకాశరావు.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటినుంచి నేరుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ ఆయనను ఆర్టీసీ చైర్మన్‌గా నియమించారు.

1952 నుంచి 2018 వరకు ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	ఎల్.ముత్తయ్య	పీడీఎఫ్
1962	బుట్టి రాజారాం	కాంగ్రెస్
1967	జిన్న మల్లారెడ్డి	స్వతంత్ర
1972	జిన్న మల్లారెడ్డి	కాంగ్రెస్
1978	గొట్టిముక్కుల రాజిరెడ్డి	కాంగ్రెస్
1983	గోనె ప్రకాశ్‌రావు	సంజయ్ విచార్‌మంచ్
1983	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1985	కాల్వ రామచంద్రారెడ్డి	టీడీపీ
1989	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1994	బిరుదు రాజమల్లు	టీడీపీ
1999	గుజ్జుల రామకృష్ణారెడ్డి	బీజేపీ
2004	గీట్ల ముకుందరెడ్డి	టీఆర్ఎస్
2009	విజయరమణారావు	టీడీపీ
2014	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్ఎస్
2018	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్ఎస్

కాంగ్రెస్ అభ్యర్థిగా 'గీట్ల'

పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గీట్ల ముకుందరెడ్డి తొలుత సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థి గోనె ప్రకాశ్‌రావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత అనూహ్యంగా గోనె ప్రకాశ్‌రావు తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికల్లో సమీప టీడీపీ అభ్యర్థి వేముల రమణయ్యపై గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీపడ్డారు. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయరమణారావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన గీట్ల ముకుందరెడ్డిని కాదని భానుప్రసాదరావుకు పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యారు.

అయితే మాలెం.. లేకుంటే మాతంగి..

- ఐదుసార్లు ఈ ఇద్దరి మధ్యే పోటాపోటీ
- మేడారం ఎస్సీ నియోజకవర్గంలో ప్రత్యేకత



మాలెం మల్లేశం



మాతంగి నర్సయ్య

గోదావరిఖని: రామగుండం పునర్విభజనకు ముందు మేడారం నియోజకవర్గంలో మాలెం మల్లేశం, మాతంగి నర్సయ్య హవా కొనసాగింది. అప్పటి మండలాలు రామగుండం, ధర్మారం, జూలపల్లి, వెల్గటూర్‌తో కలిసి మేడారం(ఎస్సీ) నియోజకవర్గంగా ఏర్పాటైంది. మేడారానికి గుండెకాయలాంటి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పోటీ రసవత్తరంగా సాగింది. ప్రధానంగా గోదావరిఖని ప్రాంతానికి చెందిన వారే మేడారం నుంచి అత్యధికంగా ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. పార్టీ టికెట్లతో సంబంధం లేకుండా ఒకసారి మాలెం మల్లేశం గెలిస్తే.. మరోసారి మాతంగి నర్సయ్య విజయం సాధించారు.

పోటీ ఇలా..

- ఆర్ఎఫ్‌సీఎల్‌లోని స్టేట్ బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేసిన మాతంగి నర్సయ్య 1978లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండాకుల గుర్తుపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- ప్రస్తుత రామగిరి మండలం సింగిరెడ్డిపల్లెలో జన్మించిన మాలెం మల్లేశం సింగరేణిలో జనరల్ మజ్దూర్‌గా, యాక్టింగ్ క్లర్క్‌గా పనిచేసి 1983లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓటమి చెందారు.
- కార్మిక క్షేత్రంలో వీరిద్దరికి మంచి పట్టు ఉండటం, ఇద్దరూ ఇక్కడివారే కావడంతో కార్మికులు వీరి గెలుపుపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు.
- దీంతో ఈ ఇద్దరి మధ్య ఐదు పర్యాయాలు పోటీ రసవత్తరంగా సాగింది.
- మూడుసార్లు మాతంగి నర్సయ్య, రెండుపర్యాయాలు మాలెం మల్లేశం గెలుపొందారు.
- టీడీపీ నుంచి గెలుపొందాక మాతంగి నర్సయ్య మంత్రిగా కూడా పనిచేశారు.

వీరిద్దరినే వరించిన విజయం..

1983లో మాతంగి నర్సయ్య టీడీపీ నుంచి పోటీచేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ఈశ్వర్‌పై ఆయన గెలుపొందారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి గుమ్మడి నర్సయ్యపై మాలెం మల్లేశం టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ నుంచి మాతంగి నర్సయ్య, టీడీపీ నుంచి మాలెం మల్లేశం పోటీపడ్డారు. ఇందులో మాతంగి నర్సయ్య విజయం సాధించారు. 1994లో మాలెం మల్లేశం స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయగా టీడీపీ మహాకూటమి నుంచి కొప్పుల ఈశ్వర్ పోటీపడ్డారు. ఈఎన్నికల్లో ఈశ్వర్‌పై మాలెం మల్లేశం విజయం సాధించారు. 1999లో టీడీపీ నుంచి మాతంగి నర్సయ్య, కాంగ్రెస్ నుంచి లక్ష్మణ్ కుమార్ పోటీచేయగా మాతంగి నర్సయ్య గెలుపొందారు. కాగా కోవిడ్ కారణంగా 2020 సెప్టెంబర్ 1న మాతంగి నర్సయ్య కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ 2019 డిసెంబర్ 11న మాలెం మల్లేశం తుదిశ్వాస విడిచారు.

ఎమ్మెల్యేలుగా మాతంగి, మాలెం..

సంవత్సరం	పేరు	పార్టీ
1983	మాతంగి నర్సయ్య	టీడీపీ
1985	మాలెం మల్లేశం	టీడీపీ
1989	మాతంగి నర్సయ్య	కాంగ్రెస్
1994	మాలెం మల్లేశం	స్వతంత్ర
1999	మాతంగి నర్సయ్య	టీడీపీ

ఈవీఎంలకు పటిష్ట భద్రత

- స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీసు బందోబస్తు
- రామగుండం, పెద్దపల్లి, మంథనికి ఇక్కడి నుంచే తరలింపు
- అపోహల నివృత్తికి ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్



స్ట్రాంగ్‌రూమ్ ఎదుట భద్రత విధుల్లో పోలీస్

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లకు పటిష్ట భద్రత కల్పించారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపర్చిన అధికారులు.. భవనం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడు నియోజకవర్గాలు..

- జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.
- వీటికి అవసరమైన 837 ఈవీఎంలను అధికారులు పెద్దపల్లి నుంచే కేటాయిస్తారు.
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 290, మంథని సెగ్మెంట్‌లో 288, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- వీటికి కేటాయించిన ఈవీఎంలను పెద్దపల్లిలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు.

ర్యాండమైజేషన్ పూర్తి..

అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తిచేసింది. వాటి వినియోగంపై వస్తున్న అపోహలను నివృత్తి చేసేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు వివరించారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఏ ఈవీఎం ఉందో ఆన్‌లైన్‌లో ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని వారు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశారు.

పెద్దపల్లి నుంచే..

పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు, మంథని నియోజకవర్గ పరిధి.. భూపాలపల్లి జిల్లాలోని ఐదు మండలాలాకు సైతం పెద్దపల్లి కలెక్టరేట్ నుంచే ఈవీఎంలు కేటాయిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. ధర్మారం మండలానికి మాత్రం జగిత్యాల కలెక్టరేట్ నుంచి ఈవీఎంలు కేటాయిస్తారని ఆ వర్గాలు వివరించాయి.

జాడ లేని 'పుడా'!

- పెద్దపల్లితోపాటు 26 గ్రామాలతో రూపకల్పన
- ఆరేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఇప్పటివరకూ అమలుకు నోచుకోని వైనం
- ముందుకు సాగని అభివృద్ధి పనులు



పెద్దపల్లి పట్టణ వ్యూ

పెద్దపల్లి రూరల్: అనూహ్యంగా జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) ఏర్పాటుకు ఆరేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ, ఇప్పటి వరకు అది అమలుకు నోచడం లేదు. జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలగు వర్షిణి పట్టణంతోపాటు పరిసరాల్లోని 26 గ్రామాలను కలిపి పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు డీటీసీపీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అవి ఇప్పటివరకు అమలుకు నోచకపోవడంతో జిల్లా అభివద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది. రాబోయే 25ఏళ్లలో చేపట్టబోయే అభివద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని 'పుడా'కు రూపకల్పన చేశారు. ఇది ఏర్పాటైతే పెద్దపల్లి పట్టణ ముఖచిత్రం సుందరంగా మారుతుందని ఆశించిన ప్రజలకు ప్రజానీకానికి నిరాశే ఎదురైంది.

3 నియోజకవర్గాలు.. 4 మండలాలు..

- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని నాలుగు మండలాలు.. వాటి పరిధిలోని 26 గ్రామ పంచాయతీలతో 'పుడా' ఏర్పాటుకు అధికార యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందించింది.
- అనుమతి కోసం రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖకు పంపించింది.
- పెద్దపల్లి నియోజకవర్గంలోని 18 పంచాయతీలు, పెద్దపల్లి మున్సిపల్, సుల్తానాబాద్ మండలంలోని 4 పంచాయతీలు, మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలంలోని మూడు పంచాయతీలు, రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని ఓ పంచాయతీని పుడా పరిధిలో చేర్చారు.
- పెద్దపల్లి మండలంలోనిరంగంపల్లి పంచాయతీ పెద్దపల్లి మున్సిపల్‌లో విలీనమైంది.
- పెద్దబొంకూర్ పంచాయతీల్లో కొంతభాగాన్ని కూడా ఇందులో విలీనం చేశారు.

కొత్త శోభ సంతరించేలా..

- కేంద్రం పట్టణ శోభ సంతరించుకునేలా ప్రత్యేక దృష్టితో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు నాలుగు జోన్లుగా విభజించారు. ఇందులో నివాసయోగ్య ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్‌గా, జలవనరులున్న ప్రాంతాన్ని వ్యవసాయజోన్‌గా గుర్తించడంతోపాటు పరిశ్రమలు, ఎడ్యుకేషనల్‌జోన్‌లుగా విభజించి ఆయా ప్రాంతాల్లో అందుకు అ నుగుణమైన వసతులు కల్పించాలని నిర్ణయించారు. పుడా అమల్లోకి వస్తే అక్రమ వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలకు అవకాశం ఉండదు. లే అవుట్ చేయాలన్నా, ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా పుడా అనుమతి తప్పనిసరి. అయితే, పుడా ఏర్పాటు కోసం పంపిన ప్రతిపాదనల గురించి తనకు తెలియదని ఇన్‌చార్జి డీటీసీపీ శ్రీనివాసరావు(జగిత్యాల) తెలిపారు.

పుడాలోకి వచ్చే గ్రామాలు ఇవే..

పెద్దపల్లి మండలం :
నిమ్మనపల్లి, నిట్టూరు, తుర్కల మద్దికుంట, అప్పన్నపేట, రాగినేడు, బ్రాహ్మణపల్లి, రంగాపూర్, రాఘవాపూర్, సబితం, గౌరెడ్డిపేట, రాంపల్లి, భోజన్నపేట, కొత్తపల్లి, పెద్ద బొంకూర్, పెద్దకల్వల, చీకురాయి, గట్టుసింగారం

సుల్తానాబాద్ మండలం :
చిన్నబొంకూర్, పూసాల, చిన్నకల్వల, రెబ్బల్‌దేవ్‌పల్లి


కమాన్‌పూర్ మండలం
రొంపికుంట, గుండారం, కల్వచర్ల

పాలకుర్తి మండలం:
కన్నాల

పంచాయతీలు ఇవే..

- జిల్లాలో 10 కిలోమీటర్ల పరిధిలోని 236.86 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల 26 గ్రామ పంచాయతీలను కలుపుతూ 'పుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.

> మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకే దేవుడి మీద కానీ.. మహానుభావుల మీదకానీ ఆధారపడొద్దు.
> – బీఆర్ అంబేడ్కర్



మీకు తెలుసా?

సహకార నేతకు తప్పని ఓటమి

కరీంనగర్: జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ముల్కనూర్ కో- ఆపరేటివ్ బ్యాంకు అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపకులైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన అల్గిరెడ్డి కాశీవిశ్వనాథ్‌రెడ్డి(హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తండ్రి) హుజూరాబాద్ శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల రాజేశ్వర్‌రావు చేతిలో ఓటమి చెందగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దుగ్గిరాల వెంకట్‌రావు చేతిలో రెండవసారి ఓటమి పాలయ్యారు.

1989 ఎన్నికల్లో స్వతంత్రులదే హవా

కరీంనగర్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో 1989లో ఉమ్మడి జిల్లాలో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించి ఔరా అనిపించారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా వెలిచాల జగపతిరావు, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కేతిరి సాయిరెడ్డి, బుగ్గారం ఎమ్మెల్యేగా జువ్వాడి రత్నాకర్‌రావు, సిరిసిల్ల ఎమ్మెల్యేగా నీరడి వెంకటకృష్ణయ్యలు గెలుపొందారు. కరీంనగర్, హుజూరాబాద్, బుగ్గారం కాంగ్రెస్ టికెట్ల కోసం పోటీ పడి టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా పైముగ్గురు పోటీకి దిగి విజయం సాధించారు. సిరిసిల్లలో మాత్రం సీపీఐ(ఎంఎల్)జనశక్తి మద్దతుతో ఎన్.వీ కృష్ణయ్య విజయం సాధించి అప్పట్లో సంచలనం సృష్టించారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిరూరల్: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన పార్టీల నాయకులు తమ మేనిఫెస్టోలో హమాలీల సంక్షేమం కోసం నిర్ణయాలను ప్రవేశపెట్టాలన్నారు. 55 ఏళ్ల వయసు నిండినవారికి రూ.6వేల ఫించన్ ఇవ్వాలన్నారు. హమాలీల పనిరేట్లను ప్రభుత్వమే నిర్ణయించి అమలు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, సత్తయ్య, అంజయ్య, మల్లయ్య, నంబయ్య, శంకరయ్య, తిరుపతి, రాజయ్య, శ్రీనివాస్, నర్సయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

'సీ విజిల్'కు 81 ఫిర్యాదులు

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటివరకు సీ విజిల్‌యాప్ ద్వారా 81 ఫిర్యాదులు అందాయని కలెక్టర ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈమేరకు వాటిని పరిష్కరించామన్నారు. 1950 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా 1,206 ఫిర్యాదులు అందాయని వివరించారు. జిల్లాలో ఇప్పటిదాకా రూ.కోటి 44లక్షల 16వేల600 పట్టుబడగా సరైన ఆధారాలు చూపిన వారికి రూ.కోటి ఒక లక్ష66వేల860 విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

క్లుప్తంగా

కొండచిలువ హతం



లాలపల్లిలో కొండచిలువ

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో కొండచిలువ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన పెద్ది రాజయ్య పంటపొలంలో ఉండగా అటుగా వస్తున్న పశు కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న రైతులు, గ్రామస్తులు కొండ హతం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతో యువకుడి మృతి

- రూ.4 లక్షలు పరిహారం చెల్లించిన యాజమాన్యం..?

పెద్దపల్లి రూరల్: జ్వరంతో బాధపడుతూ ఓ యువకుడు పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడంటూ మృతుడి బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. పెద్దపల్లి మండలం కాపులపల్లికి చెందిన పిల్లి నరేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఫిట్స్ వచ్చిందని, మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు ఆసుపత్రి యజమాన్యం పేర్కొంది. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే నరేశ్ మృతిచెందాడని బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు వివాదం సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. మృతుడి కుటుంబానికి ఆస్పత్రి యాజమాన్యం రూ.4లక్షలు పరిహారంగా చెల్లించినట్లు సమాచారం.

అమరులకు ఘన నివాళి



యైటింక్లయిన్‌కాలనీ: అమరవీరుల వారోత్సవంలో భాగంగా ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని కామ్రేడ్ కుమార స్వామి స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకన్న నాయకులతో కలిసి జెండా ఎగరవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్, రాజనర్సు, నాగరాజు, సమ్మయ్య, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీంనగర్‌క్రైం: నగరంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఓ లాడ్జిలో ఆరుగురు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.11,450 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు

- ప్లాట్‌ఫారంపై పనిచేయని డిస్‌ప్లే బోర్డులు
- ఆన్‌లైన్‌లో రైల్వే స్టేటస్‌పై అస్పష్టత
- గంటల తరబడి వేచి ఉంటున్న ప్రయాణికులు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై రైలు నెంబర్, సమయ సూచిక, బోగీల గుర్తింపు (డిస్‌ప్లే) బోర్డులు పని చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆగస్టు 6న అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మూడు నెలలుగా అమృత్ భారత్ ఆధునికీకరణ పనులు కొనసాగుతుండడంతో ప్రయాణికులకు అందించే సాంకేతికపరమైన సేవల్లో అంతరాయం కలుగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇందులో భాగంగానే ప్లాట్‌ఫారంపై రైలు వచ్చేముందు ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ ఆన్‌లైన్ అనౌన్స్‌మెంట్ ప్రారంభించిన సమయంలోనే రైలు నెంబర్, ప్లాట్‌ఫారంపై రిజర్వేషన్ బోగి నిలిచే స్థలం తదితర వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు, అనౌన్స్‌మెంట్ నిలిచిపోయింది. ఫలితంగా రైలు వచ్చే ముందు రైల్వే అధికారులు



ప్లాట్‌ఫారంపై పనిచేయని సూచిక బోర్డులు

మైక్‌లో బోగి నెంబర్ల గురించి వెల్లడించినా ప్రయాణికులకు అర్థం కాకపోవడంతో రైలు ప్లాట్‌ఫారంపై నిలిచిన తర్వాత తాము ఎక్కాల్సిన బోగిని గుర్తించేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కాగా ఆధునికీకరణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో ప్లాట్‌ఫారంపై షెడ్డు వేసేందుకు గుంతలు, ఐరన్ పోల్స్ తదితర మెటీరియల్ వేసి ఉండడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఇదిలా ఉండగా ప్రతీ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు కొనసాగుతుండటంతో రైల్వేయాప్‌లో వెళ్లాల్సిన రైలు వివరాలు తెలుసుకునే సమాచారం సైతం అసంపూర్తిగా వస్తుంది. ప్రయాణికులు సమయానికి స్టేషన్‌కు చేరుకొని ఎంత ఆలస్యంగా రైలు వచ్చినా ప్లాట్‌ఫారంపై పడిగాపులు కాస్తున్నారు. కాగా గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉంటుండడంతో కనీసం స్టేషన్‌లో టాయిలెట్స్ లేకపోవడంపై మహిళలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిమితికి మించి ప్రయాణిస్తూ..

ప్రమాదమని తెలిసినా ప్రచార సభల కోసం కొందరు కిక్కిరిసి ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. ఎన్నికల వేళ డబ్బులిస్తారన్న ఆశతో ప్రాణాలమీదికి కొని తెచ్చుకుంటున్నారని, అయినా కొందరిలో మార్పు రావడం లేదని కొందరు తెలుపుతున్నారు. ఆదివారం పెద్దపల్లిలో బీఎస్పీ ఆశీర్వాద సభ కోసం ఇలా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ సాక్షి కెమెరాకు కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



బాబ్బాబు.. జర నా మాట విను!

- నేతలు దిగివచ్చిన వేళ.. ఎన్నికల సిత్రాలు

కోరుట్ల: ఏమైందిరా రాజు.. ఎన్నడు లేంది ఇయ్యాల మన చిన్న లీడరు ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఎక్కడున్నడో ఏమో.. గీ ఎలచ్చన్ల ఏమన్న ఎంజాయ్ చేద్దామంటే దొరుకుతలేదేంది రా.. అంటూ తన దోస్తుని పలకరించిండు శ్రీను. గీ పలకరింపుతో ఇద్దరు జర దూరంగా పోయి గుసగుస మొదలెట్టిండ్రు. గ ముచ్చట సంగతేంటో తెలుసుకుందాం.



రాజు: ఏమైందిరా శీను ఒక్కసారిగా గా మందిలకెళ్లి నన్ను మూలకు పట్టుకొచ్చి ముచ్చట మొదలెట్టిన్..?

శ్రీను: అరె రాజు గీ ముచ్చట అందరిలో చెప్పేది కాదురా. వారం నుంచి మనూరి చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు. నేను కూడా మస్తుసార్ల కొట్టిన. ఎందుకు కలుస్త లేదో తెలుసా..?

రాజు: ఎందుకు ఫోన్ కలుస్తులేదని నిన్ను అడిగితి. మళ్లీ నాకెట్లా తెలుస్తది నువ్వే చెప్పు ఎం కథనో..?

శ్రీను: ఇగో ఎవల్లతోని అనకు గానీ మన చిన్న లీడరు పార్టీ మారుదమని చూస్తున్నడు. ఇది తెలిసి ఇప్పుడున్న పార్టీ మనుషులు గీ ఎలచ్చన్ల టైమ్‌లో ఎట్ల మారుతవ్ అని మస్తు ఒత్తిడి తెస్తుండ్రు. గందుకే మనోడు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ పెట్టి చుట్టాలింటికి పోయిండు.

రాజు: గట్లనా ఇప్పుడున్న పార్టీకి ఏమైందిరా, ఎందుకు మారుతడట. గీ ముచ్చట నాకు ఎప్పుడు ఇనవడలే..?

శ్రీను: ఏడాది నుంచి మన చిన్న లీడరు వాళ్ల పార్టీ పెద్ద సారును ఓ పని అడిగితే గాయిన నానబెట్టుకుంట వచ్చిండట. మందికి ఏం చేసినా చేయకపోయినా సరే కానీ నేను చెప్పిన పని కాకపోయే అని అలిగి ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టి వేరే పార్టోళ్లతోటి మంతనాలు మొదలెట్టిండని తెలిసింది.

రాజు: అవునా మరి నాకైతే ఏం తెల్వలే. మొన్న మన చిన్న లీడరు పార్టీ పెద్ద సారు మన ఊరికి వచ్చిండు గానీ ఆయన ప్రచారం కోసం వచ్చిండని అనుకున్నా.

శ్రీను: ప్రచారం లేదు ఏం లేదు. మన చిన్న లీడరు పార్టీ ఎక్కడ ఇడిసిపెడతడోనని వాళ్ల పార్టీ పెద్దసారు గడిబిడ అయిండు. మన చిన్న లీడరుకు ఫోన్ చేస్తే కల్వలేదు. డొటచ్చి పెద్ద లీడరు సీదా మనోని ఇంటికి వెళ్లిండు. గప్పుడు మనోడు గా ముచ్చట..గీ ముచ్చట చెప్పి మూడు గంటలు బతిమాలిచ్చుకున్నడు. చివరికి ఇద్దరు కలిసి పళ్లికిలిచ్చుకుంట ఓ ఫొటో దిగిండ్రు. గప్పుడు పెద్ద లీడరు మనసు తిరమైంది.

రాజు: గీ ముచ్చటంత నాకు తెల్వకపోయే. పార్టీ పెద్ద సారు వచ్చి మూడు రోజులాయే, మరి ఇంకా మన చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు కదా..?

శ్రీను: ఇగో..గీడ మరో తిరకాసు జరిగింది. చిన్న లీడరు పార్టీకి చెందిన పెద్ద లీడరు వచ్చి మాట్లాడి పోయిండో లేదో గీ ముచ్చట తెలిసి ఎక్స్‌పార్టీ లీడరు వెంటనే మనోని ఇంటికి వచ్చిండు. అగో మాతోని వస్తనని అంటివి కదా..మా పార్టీలోకి రా..అనంగనే మనోడు మళ్లీ బతిమాలించుకుని ఎక్స్‌పార్టీ లీడరుతో పళ్లికిలిచ్చుకుంట ఫొటోలు దిగిండు. ఇగ ఆ తర్వాత గీ తలనొప్పి ఎందనుకుని ఫోన్ స్విచ్ఆఫ్ చేసిండు. ఎట్లయితే ఏందిరా..ఎన్నడు రాని పెద్ద లీడర్లను మనోడు ఇంటికి రప్పించుకున్నడు, బతిమాలించుకున్నడు.

నేత్ర సేకరణపై శిక్షణ ఇప్పించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని కొంత మంది సిబ్బందికి నేత్ర సేకరణపై శిక్షణ ఇప్పించాలని కోరుతూ సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆదివారం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి వచ్చిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. గత 15 ఏళ్ల నుంచి సదాశయ ఫౌండేషన్ నేత్ర, శరీర, అవయవదానాలపై కృషిచేస్తున్న సందర్భంగా నేత్రదాతల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేత్ర సేకరణ చేసే వారు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని సిబ్బందికి నేత్ర సేకరణపై శిక్షణ ఇవ్వడంతో అందుబాటులో ఉండి నేత్ర సేకరణ తీసుకోవడం సులభతరం అవుతుందని వారు వివరించారు. దీనిపై డాక్టర్ సుజాత సానుకులంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్, డాక్టర్ సునీల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంగాధర్ మృతదేహం

చొప్పదండి: మండలంలోని రాగంపేట శివారు పందివాగు సమీపంలో ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మల్యాల మండలానికి చెందిన బాసవేని చిన్న గంగాధర్ (40) మృతిచెందాడు. మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ ఇటీవలే గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఆర్నకొండలోని బంధువుల ఇంటికి వచ్చి మ్యాడంపల్లికి ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా రాగంపేట గ్రామంలో ఇసుకను అన్‌లోడ్ చేసి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో గంగాధర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు

ఇల్లందకుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పోలీసులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలో జరిగింది. ఎస్సై రాజకుమార్ వివరాల ప్రకారం.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బైరి శ్రీనివాస్, హోంగార్డ్ రాజేందర్‌ప్రసాద్ బైక్‌పై సిరిసేడు గ్రామం నుంచి ఇల్లందకుంటకు వస్తుండగా మార్గమధ్యలో ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ కాలు, చేయి విరగగా, రాజేందర్‌ప్రసాద్ కాలి మడిమ వద్ద గాయమైంది. ఎస్సై రాజకుమార్ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. గాయపడినవారిని ఏసీపీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కిషోర్, పట్టణ సీఐ రమేశ్ పరామర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరి రమేశ్ (38) గల్ఫ్‌లో మృతిచెందగా ఆదివారం మృతదేహం ఇంటికి చేరింది. గ్రామస్తుల వివరాలు.. రమేశ్ ఉపాధి నిమిత్తం 17 నెలల క్రితం బెహరాన్ వెళ్లాడు. ఇటీవల సాయంత్రం పూట రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. అతడి మిత్రులు వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి అంత్యక్రియలు పూర్తి చేశారు.

తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మరు



కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఎంపీపీ రాసకొండ లక్ష్మీ భర్త రవిని కాంగ్రెస్ పార్టీలో చేరాలని డబ్బులు ఆశ చూపినట్లు చేసిన ఫిర్యాదుకు కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండలంలోని పేరపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రవికి ఫోన్‌లో సంప్రదింపులు చేసిన ప్రసాద్‌రెడ్డికి కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రసాద్‌రెడ్డి గతంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు అత్యంత సన్నిహితుడని పేర్కొన్నారు. పుట్ట మధుకు కమాన్‌పూర్ మండలంలో డిపాజిట్ కూడా రాదనే భయంతో శ్రీధర్‌బాబుపై తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేయిస్తున్నా మండల ప్రజలు నమ్మే స్థితిలో లేరని శ్రీధర్‌బాబును ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు తొగరి అన్నపూర్ణ, కట్కం రవీందర్, నాయకులు బొంగోని సదయ్య, జంగపల్లి ఎర్రయ్య, చిందం సతీశ్, ఆకుల రాంచంద్రం, కమ్మగోని మల్లయ్య, పొలుదాసరి మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేలేదెన్నడో...!

- ఇంకా ఖరారు కాని బీజేపీ అభ్యర్థి
- ఆశావహుల్లో అసహనం
- కార్యకర్తలు, నేతల్లో అయోమయం

పెద్దపల్లిరూరల్: అధికార బీఆర్‌ఎస్ పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతో పాటు బీఎస్పీ అభ్యర్థులు ప్రచార పర్వంలో దూసుకుపోతుండగా...కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ పార్టీ అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం మీన మేషాలు లెక్కిస్తుండడం ఆశావహుల్లో అసహనాన్ని పెంచుతోంది. బీజేపీ అభ్యర్థిత్వం కోసం మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావుతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి పోటీపడ్డారు. కాగా ఇటీవల పార్టీలో చోటు చేసుకున్న పరిస్థితులతో కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ కూడ టికెట్ రేసులో ముందుకొచ్చారు. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారపర్వంలో దూసుకుపోతున్నారు. మేమేమీ తక్కువా..అన్నట్లు బహుజనసమాజ్ పార్టీ అభ్యర్థి సైతం ప్రచారంలో ముందున్నారు. కానీ పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఇంకా ఎవరికీ ఖరారు చేయకపోవడం..ఇక్కడి నేతలు ఎవరికి వారే తమకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటుండడం తో పార్టీశ్రేణులు పరేషాన్‌లో పడ్డాయి.

తమకే టికెట్ వచ్చిందని పూజలు..

పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని జూలపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన దుగ్యాల ప్రదీప్‌కుమార్ పెద్దపల్లి నుంచి పోటీ చేసే అవకాశం తనకే దక్కిందంటూ తన అనుచరగణానికి సమాచారం అందించారు. కొదురుపాకలోని నంబులాద్రిస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేయించారు. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి టికెట్ తనకే కేటాయించారని సోమవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే ఇంకా అధికారికంగా టికెట్ ఎవరికీ కేటాయించలేదని, అవసరమైతే ఉమ్మడి కరీంనగర్ ప్రజలకు సుపరిచితురాలైన బీసీ మహిళా మాజీ ప్రతినిధికి పెద్దపల్లి నుంచి పోటీ చేయించాలనే ఆలోచనతో పార్టీ అధిష్టానం ఉన్నట్టు సమాచారం.

బీట్ ఆఫీసర్‌కు తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఇప్పపెల్లి శివారులో ఆదివారం రాత్రి టాటా ఏస్ వాహనం బైక్‌ను ఢీకొట్టగా అటవీశాఖ బీట్ ఆఫీసర్ కారం శ్రీనివాస్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ పోతారం బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మానకొండూర్: మండలంలోని దేవంపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై, అనారోగ్యానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట లక్ష్మికి ఐదుగురు కుమారులు. నాల్గో కుమారుడు కోట సంతోష్ (28) రోజూ గ్రామం నుంచి వెళ్తూ కరీంనగర్‌లో మోటార్ మెకానిక్‌గా పని చేసేవాడు. ఐదేళ్లుగా మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. గురువారం తల్లి తన నలుగురు కుమారులతో కలిసి దైవ దర్శనానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనస్తాపానికి గురైన సంతోష్ ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంతోష్ (ఫైల్)

నాటుసారా స్థావరంపై దాడి

మల్యాల (చొప్పదండి): మండలంలోని రాజారం గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 5 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లంపానకం పారబోశారు. తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న శివరాత్రి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



బెల్లంపానకం పారబోస్తున్న పోలీసులు

బాలిక అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన బాలిక అదృశ్యమైంది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు.

బియ్యం పట్టివేత

కరీంనగర్‌క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ ఆటోనగర్‌కు చెందిన టి.మల్లేశం తన వాహనంలో 3.3 క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేశారు. అతడు తక్కువ రేట్‌కు కొనుగోలు చేసి ఎక్కువ రేట్‌కు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

గొల్లపల్లి: మండలంలోని చెందోళి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఆత్రం సాయికుమార్ (24) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన సాయికుమార్ వరుసకు తమ్ముడైన శడమాకి నాగబాబుతో కలిసి జగిత్యాలలో పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో చందోళి శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి కిందపడ్డారు. ఈ క్రమంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. నాగబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. సాయికుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

తిమ్మాపూర్(మానకొండూర్): ఎన్నికల కోడ్ నేపథ్యంలో నాటుసారా, గంజాయి, గుడుంబా, అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం నల్లగొండ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మార్క రాములు తన ద్విచక్ర వాహనంపై 24 మద్యం బాటిళ్లు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. విచారణ చేస్తే అక్రమ మద్యం రవాణా చేస్తున్నాడని తెలుసుకొని వాహనంతో పాటు మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడితే 87126 58810 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీఐ వెంట ఎస్సై సరిత, సిబ్బంది కొండల్‌రెడ్డి, రజిత, సురేశ్ తదితరులున్నారు.



పట్టుబడిన మద్యంతో సీఐ, సిబ్బంది

దుక్కి దున్నకుండానే మక్క సాగు

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసిన పొలాల్లో దుక్కి దున్నకుండా యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు రైతులను మండల వ్యవసాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని రాయికల్, మేడిపల్లి, సారంగాపూర్ మండలాల్లో అత్యధికంగా ఈ పద్ధతిలో సాగు చేస్తుంటారు. దీంతో రైతులకు దుక్కి దున్నే ఖర్చు తగ్గడంతో పాటు పంటమార్పిడి వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

